క్లుప్తంగా

నేడు యూసీఏ ప్రథమ వార్షికోత్సవం

మధురపూడి: యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ (యూసీఏ) ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లోని నాగసాయిరామ్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్టు ప్రెసిడెంట్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరిగే ఈ కార్యక్రమానికి వాక్య సందేశకులుగా రాజమహేంద్రవరంలోని హోసన్న మందిర్ బ్రదర్ జాన్‌వెస్లీ, విశిష్ట అతిథిగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ముఖ్య అతిథిగా గోకవరానికి చెందిన ఈహెచ్‌హెచ్ నేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ హాలోనెన్ హాజరవుతారన్నారు.

తలరాతను మార్చగలిగేది విద్యే



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న సర్పంచ్ వీరమణి

బిక్కవోలు: ఎవరి తలరాతనైనా మార్చగలిగే శక్తి ఒక్క విద్యకే ఉందని కొంకుదురు గ్రామ సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో 578 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన పడాల శివసాయి నారాయణకు హైదరాబాద్‌కు చెందిన ఎంజే నాయుడు మెమోరియల్ ట్రస్ట్ రూ.20 వేల చెక్కును జారీ చేసింది. గురువారం కొంకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థికి ఆ చెక్కును సర్పంచ్ వీరమణి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపూడి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి, హిందీ టీచర్ మాసవరపు శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని తీవ్రగాయాలు

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డులో ముగ్గళ్ల వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని మోటారుసైకిలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తాడేపల్లిగూడెం సమీపంలోని మాధవరానికి చెందిన 35 ఏళ్ల కడిమి విజయ్ కుమార్ గురువారం వంగలపూడిలోని అత్తవారి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ముగ్గళ్ల వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. అతడి తల, నుదురు, గెడ్డానికి తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ ముత్యం శ్రీనివాస్, పైలట్ దుర్గాప్రసాద్ అపస్మారక స్థితిలో ఉన్న విజయ్ కుమార్‌కు ప్రథమ చికిత్స చేసి, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

శ్మశానవాటికలో చేతిపంపు ఏర్పాటు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఎస్సీపేటకు చెందిన శ్మశాన వాటికలో దాత అడపా నరసింహమూర్తి సాయంతో చేతి పంపు ఏర్పాటు చేశారు. ఇక్కడ నీటి సదుపాయం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన నరసింహమూర్తి చేతి పంపు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు పనులు పూర్తి చేశారు. దీనిపై స్థానిక దళిత నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. చేతిపంపు నిర్మాణ పనుల్లో బత్తిన ప్రసాద్, బత్తిన ఏసు, తోలేటి బంగారు, కాతేటి చిట్టి వెంకన్న, పలివెల బన్ను, మొర్త రాజు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

రంగంపేట: రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందిస్తున్నట్టు మండల పశు వైద్యాధికారి ఈ.జాన్‌పాల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వడిశలేరు పశు వైద్యశాలలో జొన్నలు, బొబ్బర్లు 2700 కేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి పశువులు మేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం, అధిక పాల దిగుబడి వస్తుందన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

సీటీఆర్ఐ: ముస్లింల సమస్యలు తెలుసుకుని, వాటిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నామని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. ఆయన గురువారం స్థానికంగా పలు మసీదులను సందర్శించి ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతనాలు అందుతున్న తీరును పరిశీలించారు. షాదీఖానాలు, ఖబరిస్థాన్ ప్రహరీలు, ధార్మిక కేంద్రాల మరమ్మతులకు సంబంధించి ఎంతో కాలంగా ఉన్న డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఉర్దూను ప్రభుత్వం రెండో అధికారిక భాషగా గుర్తించిందన్నారు. కేవలం ధార్మికపరమైనవే కాక ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు ఉన్నా, అర్హత ఉండి పథకాలను అందుకోలేకపోతున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ అందజేస్తున్న పథకాల ద్వారా ముస్లిం సమాజం ఎంతో లాభపడుతోందన్నారు. వాటిని ఉపయోగించుకుని విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షబ్బర్ బాషా, మహ్మద్ పాల్గొన్నారు.

రైతుకు యంత్రం.. దిగుబడి మంత్రం

- వైఎస్సార్ యంత్రసేవా పథకంతో ఎంతో మేలు
- పదిశాతం రాయితో పరికరాలు



మునగాలలో రైతుకు ట్రాక్టర్ అందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

మధురపూడి: వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. సాగుకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారు. తద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సాగులో దిగుబడిని పెంచాలన్న లక్ష్యంతో వైఎస్సార్ యంత్ర సేవాపథకం ప్రవేశపెట్టారు. దీనిద్వారా గత నాలుగేళ్లుగా రైతులకు యంత్రాలను పదిశాతం రాయితీపై అందజేస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 69 గ్రామాలున్నాయి. ఇక్కడ 71 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 355 మంది రైతులకు 71 యంత్రాలను అందజేశారు.

యంత్రాలు ఇవే..

వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా పదిశాతం రాయితీపై ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పవర్ ట్రిల్లర్లు, స్ప్రేయర్లు, కల్టివేటర్లు, బండ్ ఫార్మర్లు రైతులకు అందజేశారు. గ్రామాల్లోని పొలాలు, రైతుల సంఖ్య ఆధారంగా వీటిని పంపిణీ చేశారు. వేసవి దుక్కులు, దమ్ములు చేయడంతో పాటు పంట రవాణాకు ట్రాక్టర్లు ఎంతో ఉపయోగపడతాయి. చేలల్లో దుక్కు, దమ్ము చేయడానికి రోటోవేటర్లను వినియోగిస్తారు. దిగబడే చేలు, తేలిక నేలల్లో దమ్ము చేయడానికి పవర్ టిల్లర్ ఉపయోగపడుతోంది. వరికోత మెషీన్ ద్వారా సకాలంలో పంటకోత నిర్వహించుకోవచ్చు. చేలల్లో గట్లు వేసుకోవడానికి బండ్ ఫార్మర్ ఉపయోగపడుతోంది. పంటకు పట్టిన పురుగు, చీడలపై పురుగుమందు పిచికారీకి స్ప్రేయర్లు, నాగలి సెట్‌గా ఉన్న కల్టివేటర్ పొలంలో ఇనమారు దుక్కులకు ఉపయోకరంగా ఉంటాయి.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

రైతులకు యంత్రాలు అందజేయడం ద్వారా సాగు విస్తీర్ణం పెరగడానికి చర్యలు తీసుకుంటున్నారు. కోరుకొండ మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో 13,500 ఎకరాలను సాగు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఈ సంవత్సరం 14,940 నుంచి 16,000 ఎకరాల విస్తీర్ణానికి పెరుగుతుందనే అంచనాలున్నాయి. అలాగే సీతానగరం మండలంలో 14,173 ఎకరాలకు, రాజానగరం మండంలో 12,458 ఎకరాల విస్తీర్ణానికి పెంచాలనే అంచనాలున్నాయి. వ్యవసాయ శాఖాధికారులు రైతులతో నిర్వహించిన సమావేశాలు, అవగాహన కార్యక్రమాల ఆధారంగా ఈ ప్రణాళిక సిద్ధమైంది. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు రైతన్నలు సమాయత్తమయ్యారు. వరిలో గతంతో పోలిస్తే ఎంటీయూ 1,318 కొత్త రకాన్ని సాగులోకి తీసుకొచ్చారు. రెగ్యులర్‌గా ఎంటీయూ 1,064, 1,061 రకాలు సాగయ్యాయి. బీపీటీ 5202, పీఎల్‌ఏ 1,100 సాగుచేశారు.

ప్రభుత్వ ప్రోత్సాహం



వ్యవసాయానికి జగన్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. పదిశాతం రాయితీతో యంత్రపరికరాలు ఇవ్వడం ఉపయోగకరంగా ఉంది. ఆర్‌బీకేల ద్వారా ఎంతో మేలు జరుగుతోంది.

– బుద్దిగ సత్తిబాబు, రైతు, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్మన్

కౌలు కార్డులు



ప్రకృతి విపత్తుల సమయంలో, ప్రభుత్వ పథకాల కోసం కౌలు కార్డులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. జగన్ పాలనలో వ్యవసాయం పండగలా మారింది. రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు.

– బి.సత్యనారాయణ, రైతు, గాడాల

రైతులకు అవగాహన



ప్రభుత్వ పథకాలపై రైతన్నలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. వేసవిలో భూ పరీక్షలు నిర్వహించడం, నత్రజని తదితర స్వభావాన్ని గుర్తించడం జరిగింది. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా ఇచ్చిన యంత్రాలతో సాగు విస్తీర్ణం పెంచడానికి ప్రణాళిక వేశాం.

– ఏ.గౌరీదేవి, వ్యవసాయాధికారి, కోరుకొండ

15న బహిరంగ వేలం



గ్రామ సభలో లాటరీ తీసి ప్రకటిస్తున్న సర్పంచ్ వారా కుమారి, ఈఓ విజయ్‌రెడ్డి

అనపర్తి: అనపర్తి గ్రామ పంచాయతీ మార్కెట్ ఏరియాలో నూతనంగా నిర్మించిన నాలుగు దుకాణ సముదాయాల్లోని 32 షాపులను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈ నెల 15వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి తెలిపారు. స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో సర్పంచ్ వారా కుమారి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించి లాటరీ తీశారు. జ్యోతీరామ్‌పూలే కాంప్లెక్స్‌లో 6, 7 నెంబర్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 8వ నెంబర్, బాబూ జగ్జీవన్‌రామ్ కాంప్లెక్స్‌లో 1వ నెంబర్, డాక్టర్ వైఎస్సార్ కాంప్లెక్స్‌లో 1వ నెంబర్ షాపులు లాటరీలో వచ్చాయన్నారు. ఐదు షాపుల్ని షెడ్యూల్ కులాలకు, మిగిలిన 27 షాపులు ఓపెన్ కేటగిరీలోనూ బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంనూరి సూర్యనారాయణ, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కుతుకులూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



కుతుకులూరులో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని చెప్పారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ధైర్యంగా గ్రామాల్లో ప్రజల వద్దకు తిరుగుతున్నామన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన భరోసాగా నిలిచే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఉప సర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు పులగం శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి శ్రీదేవి, పార్టీ యూత్ అధ్యక్షుడు పడాల విజయ్‌రెడ్డి, ఆర్‌కే, కర్రి సంజీవరెడ్డి, జాజి, పడాల తమ్మిరెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

ప్రభుత్వ పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆయన ఆకాంక్షకు అనుగుణంగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. పింఛన్ల నుంచి అనేక పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకు చేర్చుతున్నారు. వారి సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సీతానగరం

వలంటీర్ సేవలు భేష్



సీతానగరంలో మంగతాయారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

సీతానగరానికి చెందిన 46 ఏళ్ల మెంతే అలివేలు మంగతాయారు చర్మవ్యాధితో బాధపడుతున్నారు. వలంటీర్ సేవలు ఆమెకు ఎంతో సాయంగా ఉంటున్నాయి. ఆమె కుమారుడికి నెలల వయసులోనే భర్త మరణించాడు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆమెకు అన్ని పథకాలు వర్తిస్తున్నాయి. సీఎంగా జగన్ అధికారంలోకి వచ్చాక విద్యాదీవెన పథకంతో కుమారుడు శివకుమార్ డిగ్రీ చదివాడు. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇక మంగతాయారుకు ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీర్ పింఛన్ అందిస్తున్నాడు. అలాగే ఆమెకు కాపునేస్తం పథకం గురించి వివరించి, లబ్ధి పొందేలా చేశాడు. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం చుట్టూ రెండు, మూడు రోజులు తిరిగాల్సి వచ్చేదని, జగన్ పాలనలో ఇంటికే వచ్చి ఇస్తున్నారని మంగతాయారు ఆనందం వ్యక్తం చేసింది. గ్రామ వలంటీర్ వ్యవస్థతో తన కుటుంబానికి ఎంతో మేలు జరిగిందని తెలిపింది.

కృతజ్ఞతలు



కూనవరంలో మహాలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమ్య

కూనవరానికి చెందిన 73 ఏళ్ల పెట్ల మహాలక్ష్మి అనే వ్యక్తికి వివాహమైన కుమార్తె, ముగ్గురు కుమారులున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో ఆ కుటుంబంలో వెలుగులు నింపాయి. వలంటీర్ రమ్య ఆ కుటుంబానికి ఏ పథకాలు వర్తిస్తాయో వివరించి, వాటికి అవసరమైన పత్రాలను సిద్ధం చేసి, ఆ కుటుంబం లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంది. మహాలక్ష్మి ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ తీసుకుంటున్నారు. అతడి కుమార్తెకు కాపు నేస్తం, కోడళ్లకు అమ్మ ఒడి పథకాలు వర్తించాయి. వలంటీర్ లేకపోతే తమకు ఈ పథకాలు వచ్చేవి కావని మహాలక్ష్మి అన్నారు. ఇంటి వద్దకే వచ్చి పథకాలు అందజేస్తున్న వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవీలత తదితరులు



శ్రీరంగపట్నంలో పత్రాలు అందజేస్తున్న నాయకులు



అచ్యుతాపురంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



చినకొండేపూడిలో పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ తదితరులు

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. గండ్రేడు గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ కుడిపూడి మాధవీలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసుచౌదరి, మండల ప్రత్యేక అధికారి రామారావు, సచివాలయ కార్యదర్శులు త్రినాథ్, శిరీష, ఉప సర్పంచ్ కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

మధురపూడి: సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష వేదికగా నిలిచిందని వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు అన్నారు. మండలంలోని జంబూపట్నం, శ్రీరంగపట్నం1 సచివాలయాల పరిధిలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. శ్రీరంగపట్నంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దాల రమణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్న దొర, శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, నాయకులు ఉల్లి చెల్లారావు, కొయిడాల నానాజీ, సూరిశెట్టి కుటుంబరావు, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, తహసీల్దార్ పాపారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

గోకవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, పార్టీ నాయకుడు సుంకర వీరబాబు సూచించారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి, అచ్యుతాపురం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సర్టిఫికెట్‌లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బత్తుల శ్రీను, సరకణం రామలక్ష్మి, ఎంపీటీసీ కోట సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: చినకొండేపూడి1లో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, మిర్తిపాడులో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా చినకొండేపూడి సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాలన్నీ ప్రజల ముంగిటకు చేరుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, సర్పంచ్ బంగారు సత్యవతి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, పోలినాటి రామచంద్రరావు పాల్గొన్నారు. కాగా.. చినకొండేపూడి 2, ఉండేశ్వరపురంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తారు.

ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు



సుభద్రంపేటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

బిక్కవోలు: జగనన్న సురక్షతో సత్వర సేవలు పొందొచ్చని తహసీల్దార్ పోసిబాబు అన్నారు. గురువారం మండలంలోని తొస్సిపూడిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25,229 గృహాలకు గాను ఇప్పటివరకూ 10,028 గృహాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. తొస్సిపూడిలో 1,061 ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భవాని, మాజీ సర్పంచులు తేతలి జగ్గిరెడ్డి, విస్సాకోటి సుబ్బారావు, వార్డు సభ్యులు తేతలి తులసి తదితరులు పాల్గొన్నారు. బలభద్రపురంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, సర్పంచ్ బుంగా రామారావుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది.

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులందరికీ ప్రభుత్వ సేవలే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. గురువారం సుభద్రంపేట సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం అర్హులైన 960 మందికి పలు రకాలైన ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కూటి సాయితాతారావు, ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, పంచాయతీ కార్యదర్శి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పేపరు ప్రతుల దహనం



నిరసన తెలుపుతున్న బీడీసీ నిర్వాహకులు

రాజానగరం: స్థానిక గ్రంథాలయం వద్ద మండలంలోని బుక్ డిపాజిట్ సెంటర్ల (బీడీసీ) నిర్వాహకులు గురువారం ఆంధ్రజ్యోతి పేపరు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న తమపై ఆంధ్రజ్యోతి పత్రిక ఉమ్మడి కృష్ణాజిల్లా ఎడిషన్‌లో 'బుక్ పేరిట బొక్కేస్తున్నారు' అనే శీర్షికతో వార్తను ప్రచురించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తప్పుడు రాతలతో ఉనికి కోసం ప్రాకులాడుతున్నారంటూ ఆ పత్రికపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 30 ఏళ్లుగా గ్రంథాలయాలకు అనుబంధంగా పనిచేస్తున్న తమపై ఇటువంటి తప్పుడు కథనాలు ప్రచురించడం తగదన్నారు. గౌరవ వేతనం రూ.మూడు వేలు, పుస్తకాలు, పేపర్ల కోసం రూ.వెయ్యి చొప్పున గ్రంథాలయ సంస్థ చెల్లిస్తోందన్నారు. దీనిలో బొక్కేయడానికి ఏముందో ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ వివరించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో చురుకుగా ఎల్‌సీడీసీ సర్వే



రాజానగరం పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ వసుంధర

రాజానగరం: క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా జిల్లాలో ఇంటింటా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) సర్వే జరుగుతోందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వసుంధర అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆమె రోగులకు పంపిణీ చేస్తున్న మందులు, ఉన్న సదుపాయాలతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వ్యాధి అనుమానిత లక్షణాలు ముఖ్యంగా శరీరంపై ఉండే మచ్చలను ఈ సర్వేలో ఆశ వర్కర్లు, వలంటర్లు గుర్తిస్తున్నారన్నారు. అనుమానితులను దగ్గరలోని పీహెచ్‌సీలకు పంపిస్తున్నారని, అక్కడ ఉన్న వైద్యులు పరీక్షించి, తదనుగుణంగా వైద్యం అందిస్తారన్నారు. రాజానగరం మండలంలో ఇంతవరకు 22 గ్రామ సచివాలయాల పరిధిలో 58,057 మందిని ఇంటింటికీ వెళ్లి పరీక్షించి, 1,736 మందికి మచ్చలున్నట్టు గుర్తించారన్నారు. అయితే ఆ మచ్చలు క్షయవ్యాధికి సంబంధించినవి కావని, చర్మవ్యాధులకు సంబంధించినవిగా పీహెచ్‌సీలో వైద్యులు స్పష్టం చేశారన్నారు. ఇదే విధంగా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో సర్వే, అనంతరం వైద్య పరీక్షలు జరిపి, వ్యాధి నిర్ధారణ చేస్తారన్నారు. ఈ సర్వే ఈనెల 27లోగా పూర్తవుతుందన్నారు.

పనితీరును మెరుగుపర్చుకోవాలి

రాజానగరం పీహెచ్‌సీ సిబ్బంది పనితీరు ఏమాత్రం బాగోలేదంటూ మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు విమర్శలు చేయడాన్ని ప్రస్తావించగా డాక్టర్ వసుంధర అసహనం వ్యక్తం చేశారు. వచ్చిన రోగులతో చిరాకులు, పరాకులు పడకుండా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మీ పని తీరును మెరుగుపర్చుకోవాలని, లేకుంటే ఇబ్బంది పడతారని హితవు పలికారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు విద్యార్థుల ఎంపిక



సీహెచ్ వెంకటలక్ష్మి



కె.భువనేశ్వరి



సీహెచ్ శివరామస్వామి



టీపీఎస్ఎస్ చందన



ఎస్.వైష్ణవి

పెదపూడి: మండలంలోని సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు త్రిమూర్తులు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ 2022–2023 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న సీహెచ్ వెంకటలక్ష్మి(నూజివీడు), కె.భువనేశ్వరి(నూజివీడు), సీహెచ్ శివరామస్వామి(ఒంగోలు), టీపీఎస్ఎస్ చందన(ఒంగోలు), ఎస్.వైష్ణవి(శ్రీకాకుళం) ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. వారిని గ్రామ సర్పంచ్ అద్దంకి మాచరమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరామచంద్రమూర్తి తదితరులు అభినందించారు.

భారీ వర్షం

గోకవరం: మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోపక్క పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు ఖరీఫ్ పనులు చేపట్టారు.